ప్రజాశక్తి
బుధవారం 24 మే 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఇక నుంచి కలెక్టర్లు రాకపోతే

సమావేశ బహిష్కరణ

- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ సభ్యుల ధ్వజం
- అల్లూరి జిల్లాలో టెన్త్ ఫలితాలు దిగజారడంపై ఆందోళన
- స్కూళ్లను పరిశీలించాలని జెడ్‌పిటిసిలకు ఛైర్‌పర్సన్ సుభద్ర సూచన
- వాడీవేడిగా జెడ్‌పి సమావేశం

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్లు, ఐటిడిఎ పిఒ రాకపోతే వచ్చే సమావేశాన్ని బాయ్‌కాట్ చేద్దాం. వచ్చేసారి నుంచి సమావేశం నిర్వహించ కూడదు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాల్సిన కలెక్టర్లు రాకపోతే సమావేశం నిర్వహించుకోవడం ఎందుకు ? సమావేశానికి రాని కలెక్టర్‌పై ప్రభుత్వానికి ఫిర్యాదుచేస్తా' అని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. జిల్లా పరిషత్ సమావేశానికి కలెక్టర్లు, పిఒ రాకపోవడంపై సభ్యులు మంగళవారం వివిధ సందర్భాల్లో ప్రస్తావించినప్పుడు ఛైర్‌పర్సన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పదో తరగతి ఫలితాల్లో 24వ స్థానంలో వుండడంపై సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఫలితాలు రాకపోవడానికిగల కారణాలను గుర్తించి, లోపాలను సరిచేయాలని అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఏజెన్సీలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో పది, ఇంటర్ ఫలితాలు బాగోలేకపోవడంపై జెడ్‌పిటిసిలు ఆవేదన వ్యక్తంచేశారు. విద్యాబోధన మెరుగుపడకపోతే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని అన్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఫలితాలు మెరుగుడేందుకు చర్యలు చేపట్టాలని ఛైర్‌పర్సన్ సుభద్ర విద్యాశాఖాధికారులకు సూచించారు. పాఠశాలల మిగతా 2లో..

సమస్యలపై ప్రశ్నిస్తున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

విశాఖ పోర్టు రికార్డు ప్రగతి

73.73 మిలియన్ టన్నుల రవాణాతో కొత్త చరిత్ర

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2022-2023 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ 73.73 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి నూతన చరిత్ర సృష్టించింది. తూర్పు తీరంలో రెండో స్థానంలో నిలిచి తన విశిష్టతను చాటుకుంది. 7 శాతం వృద్ధి సాధించడంతో పాటు విశాఖపట్నం పోర్టు చరిత్రలో అత్యధిక సరుకు రవాణా రికార్డును నెలకొల్పింది. ఈ మేరకు మంగళవారం పోర్టు తాజా నివేదికను వెల్లడించింది. వైజాగ్ పోర్టు ఈ ఏడాది స్టీమ్‌కోల్, క్రూడ్ ఆయిల్, కుకింగ్ కోల్, ఎరువుల సరుకు రవాణాలో వృద్ధి నమోదు చేసింది. ట్రాఫిక్ విభాగానికి సంబంధించి గత ఏడాది సెప్టెంబర్ 25న వెస్ట్ క్యూ 1 బెర్త్‌లో ఫెర్రో మాంగనీస్ స్లాగ్‌ను ఎంవిఎస్‌జె స్టార్ నౌక నుంచి పోర్టులో దించారు. అక్టోబర్ 16న ఈస్ట్ క్యూ 7 బెర్త్ నుంచి హై కార్బన్ ఫెర్రో మాంగనీస్‌ను ఎంవి ఆలమ్ సయాంగ్ నౌకలోకి ఎక్కించారు. అలాగే డిసెంబర్ 2022 నుంచి బేబీ కేప్ (260 మీటర్ల పొడవు, 43 మీటర్ల వెడల్పు) వెస్సల్స్ ఇన్ హార్బర్‌లోకి వచ్చే విధంగా ఆధునికీకరణ పనులు చేపట్టారు. రూ.151 కోట్లతో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఫిష్షింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. పోర్టును మిగతా 2లో..

కెకె లైన్‌లో భారీగా రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్ కొత్తవలస - కిరండూల్ (కెకె) లైన్‌లోని శృంగవరపుకోట - బొడ్డవర స్టేషన్ల మధ్య డబ్లింగ్‌కు సంబంధించి నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్ళను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. 18514 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి 29 వరకు, 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 26 నుంచి 30 వరకూ మిగతా 2లో..

విశాఖ నగర వైభవాన్ని మరింత పెంచండి

వార్త 2లో..

ఎయును సందర్శించిన ఆర్.నారాయణమూర్తి

వార్త 3లో..

కనీస పింఛను రూ.9 వేలుకు పెంచాలి

వార్త 3లో..

ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న సంఘం జాతీయ నాయకులు సంపత్

ముగిసిన ఎల్ఐసి ఎఓఐ మహాసభ

19 తీర్మానాలు ఆమోదం

వార్త మెయిన్‌లో..

రెజ్లర్ల పోరాటానికి అండగా ఉంటాం

- విశాఖలో మహిళా సంఘాల కొవ్వొత్తుల ప్రదర్శన
- ఎల్ఐసి కార్యాలయం వద్ద మహిళా ఉద్యోగుల ధర్నా
- బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్

తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీలో కొద్ది రోజులుగా రెజ్లర్లు చేపడుతున్న పోరాటానికి మద్దతుగా విశాఖలో మంగళవారం పలుచోట్ల సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి. రెజ్లర్లకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని సంఘాల నాయకులు తెలిపారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణం అరెస్ట్ చేయాలని, పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం జిల్లా మహిళా సంఘాల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఐద్వా, మహిళా సమాఖ్య, పిఒడబ్ల్యు, సిఎంఎస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.విమల, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బి.వెంకటలక్ష్మి, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు డి.లలిత, అరుణోదయ మిగతా 2లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న మహిళా సంఘాల నేతలు

దీక్షల్లో కూర్చున్న విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పడిన ప్రభుత్వ రంగాన్ని అందరం కలిసి కాపాడుకుందామని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు మంగళవారానికి 782వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. కర్మాగారాన్ని దొడ్డిదారిలో మోడీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోందన్నారు. విశాఖపట్నం మహా నగరంగా మారడంలో ప్రభుత్వరంగ పరిశ్రమలు కీలకపాత్ర పోషించాయన్నారు. లక్షలాది మంది వీటిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులను స్టీల్‌ప్లాంట్‌లోకి రానీయకుండా అడ్డుకుంటామన్నారు. దీక్షల్లో క్యాబ్ యూనియన్ నాయకులు నాయుడు, గోపికృష్ణ, అప్పలరాజు, శివ, శ్రీనివాసు, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహనతోనే స్కిజో ఫ్రినియా నివారణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్కిజో ఫ్రినియా అనేది మానసిక వ్యాధి అని, దీనిని చికిత్స ద్వారా నయం చేయవచ్చునని ఓం ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ ఎన్ఎల్.శంకర్ శాస్త్రి, సుస్మిత గాజుల వెల్లడించారు. ఎంవిపి.కాలనీ సెక్టార్ -1లోగల ఓం ఆస్పత్రిలో ఈ నెల 24 ప్రపంచ స్కిజో ఫ్రినియా డేను పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ వ్యాధిగ్రస్తులు వెంటనే మానసిక వైద్యునిచే చికిత్స తీసుకోవాలని సూచించారు. వీరిలో ఎక్కువగా నెగటివ్ లక్షణాలు ఉంటాయన్నారు. వీరు ఎక్కువగా ఒంటరిగా ఉండడం, నలుగురిలో కలవక పోవడం, అందరూ తన గురించే మాట్లాడుతున్నారని అనుకోవడం చేస్తుంటారన్నారు. ఈ నెల 24న తమ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు 9885447788 నెంబర్‌కి ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. శిబిరాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టర్నర్ సత్రం ఖాళీ స్థలాలకు వేలం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని టర్నర్ సత్రం ఖాళీ స్థలాలకు మంగళవారం వేలం నిర్వహించారు. టర్నర్ సత్రం డోర్ నెంబర్ 28-2-32 దక్షిణం వైపుగల (ఆకెళ్ళ బ్లాక్) వాయువ్య భాగం ఖాళీ స్థలాలను 11 సంవత్సరాలకుగాను నెలవారీ అద్దె ప్రాతిపదికన బహిరంగ వేలం వేశారు. 19 మంది ప్రథమ ధరావతు చెల్లించి టెండరులో పాల్గొన్నారు. జాగు దుర్గా ప్రసాద్, నడిమిపల్లి శ్రీరంగ ప్రభాకర్ హెచ్చుపాట పాడారు. బహిరంగ వేలం కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉపకమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ కె.శిరీష, డిసి కార్యాలయం సూపరింటెండెంట్ విజయకుమార్, టర్నర్ సత్రం కార్యనిర్వహణాధికారి ఎన్.ప్రసన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ వసంతరావు పాల్గొన్నారు.

క్యాప్ జెమినీ ఎఐఇ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : క్యాప్ జెమినీ అప్లయిడ్ ఇన్నోవేషన్ ఎక్సేంజ్ (ఎఐఇ)ని వినూత్నంగా ఆవిష్కరించినట్లు సంస్థ సీనియర్ డైరెక్టర్ రంజన్ ప్రధాన్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈసరికే అప్లయ్డ్ ఇన్నోవేషన్ ఎక్సేంజ్‌ను హైదరాబాదులో ఏర్పాటుచేశామన్నారు. ఇది భారతదేశపు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ముందడుగు అని తెలిపారు. ఆర్థిక సేవలు, లైఫ్ సైన్సెస్, ప్రజా రవాణా, కన్స్యూమర్ ఉత్పత్తులలో శక్తివంతమైన పోర్ట్‌ఫోలియో కలిగి ఉందన్నారు.

విశాఖ నగర వైభవాన్ని మరింత పెంచండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర వైభవాన్ని మరింత పెంచేలా కృషి చేయాలని గ్రేటర్ విశాఖ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లుకు వైసిపి రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి దిశానిర్దేశం చేశారు. జివిఎంసి కార్పొరేటర్లతో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసి వారితో మమేకమవ్వాలని హితబోధ చేశారు. అవినీతికి తావివ్వకుండా ప్రజా సేవలో వుండాలని సూచించారు. ఎవరెవరు ఏం చేస్తున్నారో, ఎవరి వార్డులో ఏం జరుగుతుందో తనకు పూర్తి సమాచారం వుందని స్పష్టం చేశారు. కొంతమంది పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు, మేయర్ హరి వెంకట కుమారి, అక్కరమాని వెంకటరావు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, బాణాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఇక నుంచి కలెక్టర్లు రాకపోతే సమావేశ బహిష్కరణ

తనిఖీలకు వెళ్లినప్పుడు విద్యార్థుల స్థాయిని పరిశీలించాలన్నారు. కెజిబివిల్లో కెమిస్ట్రీ, ఫిజిక్స్, లెక్కలు బోధించే అధ్యాపకుల్లేకపోవడంతో ఉత్తీర్ణత తగ్గిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఫలితాలు మెరుగుపడేందుకు విద్యా సంవత్సరం ప్రారంభించేనాటికి ఖాళీల్లేకుండా చూడాలన్నారు. వివిధ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలను పరిశీలించాలని జెడ్‌పిటిసిలకు సూచించారు. పాఠశాలల పరిస్థితిని చెబితే వాటిపై చర్చించి ఫలితాలు మెరుగుపడేలా చర్చిద్దామన్నారు.

అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ మైదాన ప్రాంతంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో వచ్చిన ఫలితాలు, ఏజెన్సీలోని ఎందుకురావడం లేదని ప్రశ్నించారు. టెన్త్, ఇంటర్‌లలో ఉత్తీర్ణత తగ్గడానికి కారణాలను గుర్తించి సరిచేయాలన్నారు. ఉత్తీర్ణతలో జిల్లా ఎందుకు వెనుకబడింది? టీచర్స్ తక్కువ వున్నారా? ఎందుకు రిజల్ట్ రాలేదో చెప్పండి? అని కొయ్యూరు జెడ్‌పిటిసి నూకరాజు ప్రశ్నించారు. రెండు, మూడు నెలలకు ఒకసారి వార్డెన్లను మార్చడం సరికాదని, ఇకపై సబ్జెక్టు టీచర్లను వార్డెన్లుగా నియమించొద్దని పెదబయలు జెడ్‌పిటిసి జన్నిబాబు అన్నారు. బుచ్చెయ్యపేట జెడ్‌పిటిసి దొండ రాంబాబు మాట్లాడుతూ ఐటిడిఎ పిఒ సమీక్షించి మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. అల్లూరి జిల్లా నుంచి సమావేశానికి ఐఎఎస్ అధికారులు రాకపోతే సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎవరు పరిష్కరిస్తారన్నారు. దీనిపై ఛైర్‌పర్సన్ తీవ్రంగా స్పందిస్తూ వచ్చే సమావేశానికి పిఒ, మూడు జిల్లాల కలెక్టర్లు రాకపోతే సమావేశం నిర్వహించొద్దన్నారు. అరకు జెడ్‌పిటిసి శెట్టి రోహిణి మాట్లాడుతూ అల్లూరి జిల్లా నుంచి వచ్చే సమావేశానికి కలెక్టర్ రాకపోతే ఏజెన్సీ జెడ్‌పిటిసిలంతా సమావేశం బహిష్కరిస్తామన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులేరాకపోతే సమావేశ ప్రయోజనం ఏంటని అన్నారు. దీనిపై స్పందించిన సుభద్ర.. సమావేశానికి రాని అల్లూరి జిల్లా కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సంపతపురం లే అవుట్ బదులు ఇదే వూర్లోని వేరేచోట లే అవుట్ వేయాలని అనకాపల్లి ఎంపిపి సూరిబాబు, నాడు-నేడు పనుల్లో ఆక్రమణలకు పాల్పడిన అధికారిని విచారణాధికారిగా నియమించడంపై మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట సోమసత్యానారాయణ, ప్రయివేటు విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గొలుగొండ జెడ్‌పిటిసి గిరిబాబు, ఎస్.రాయవరం మండలంలోని పెనుగోలు పిహెచ్‌సిలో టైఫాయిడ్ కిట్స్‌లేవని జెడ్‌పిటిసి కాకర్ల దేవి సమావేశంలో ప్రస్తావించారు. అచ్యుతాపురం జెడ్‌పిటిసి లాలం రాంబాబు (రాము) మాట్లాడుతూ చోడపల్లిలో జగనన్న లే - అవుట్‌లో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొనేలా ఆ స్థలాల్లేవని, వేరే చోట స్థలాలు ఇవ్వాలని అన్నారు. ఎదురువాడ లే అవుట్‌లోకి పట్టాలు పొందిన లబ్ధిదారులను వెళ్లనీయకుండా అడ్డుపడుతున్న అటవీశాఖ తీరు పట్ల అభ్యంతరం చెబుతూ, సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు.

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు : గంగరాజు

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని తీర్మానం చేయాలని సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అన్నారు. ఏజెన్సీలో చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు వెంటనే చేపట్టడంతోపాటు కొత్తగా చెక్‌డ్యామ్‌లు మంజూరు చేయాలన్నారు. రొంపిల్లి పంచాయతీలో బూరుగ, చినకోనెల, కరకవలస, గూడెం, దబ్బలపాడు గ్రామాలకు విద్యుత్ లైన్లు వేసేందుకు అటవీశాఖ అడ్డంకులను తొలగించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు.

నిర్మాణాలకు ఇసుక సమస్యలేకుండా చూడండి: మంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రభుత్వ నిర్మాణ పనులు, పేదలు కట్టుకొనే ఇళ్లకు ఇసుక సమస్యలేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్లను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. ఇసుక అవసరాలపై సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకొని, ఆ ప్రకారమే ఎడ్ల బండ్లతో ఇసుక తీసుకెళ్లేలా చూడాలన్నారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వి.కల్యాణి, విశాఖపట్నం, అనకాపల్లి జాయింట్ కలెక్టర్లు కెఎస్.విశ్వనాథన్, ఎం.జాహ్నవి, జిల్లా పరిషత్ సిఇఒ పి.శ్రీరామమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెజ్లర్ల పోరాటానికి అండగా ఉంటాం



ఎల్ఐసి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళా ఉద్యోగులు

సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.లక్ష్మి మాట్లాడారు. రెజ్లర్లపై బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదు ఇచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. విచారణ కమిటీ నివేదికను నేటికీ బయట పెట్టకపోవడం దారుణమన్నారు. పని స్థలాలలో లైంగిక వేధింపులకు పాల్పడేవారిని రక్షించడానికి పూనుకున్నట్టుగా కేంద్ర వైఖరి ఉందన్నారు. బ్రిజ్‌భూషణ్‌పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయని, అయోధ్య బాబ్రీ మసీదును ధ్వంసం చేసిన దుండగుల్లో మొదటి వరుసలో ఆయన ఉన్నాడని, అనేక హత్య కేసులు, లైంగిక దాడులకు పాల్పడిన కేసుల్లో క్రిమినల్ అని గుర్తుచేశారు. అలాంటివాడికి బిజెపి టికెట్ ఇవ్వడమే కాకుండా రెజ్లర్ల సమాఖ్యకు జాతీయ అధ్యక్షునిగా నియమించిందన్నారు. తాను ఏం చేసినా తననెవరూ ఏమీ చేయలేరన్న ధైర్యంతోనే రెజ్లర్లపై అతడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని తెలిపారు. బ్రిజ్ భూషణ్‌ను ప్రభుత్వం అరెస్టు చేయకపోగా, ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై భౌతిక దాడులకు పాల్పడటం మరింత దుర్మార్గమన్నారు. అతనిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన..

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ డివిజన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు కూడా దీనిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ జనవరిలోనే బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ తీరుపై మహిళా రెజ్లర్లు ఆందోళనకు దిగారన్నారు. దీనిపై కమిటీ వేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారన్నారు. ఐదు నెలలు గడిచినా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో మళ్లీ రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద ధర్నా ప్రారంభించారన్నారు. వారికి పలువురు అంతర్జాతీయ ఒలింపియన్లు, క్రీడాకారులు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. రెజ్లర్లు పతకాలు సాధించినప్పుడు తమ ఇంటికి ఆహ్వానించిన ప్రధాని ఇప్పుడు వారి సమస్యలను ఉపేక్షిస్తున్నారని విమర్శించారు. వారి నిరసనను బలహీన పర్చడానికి పలు కుట్రలు సాగిస్తున్నారన్నారు. అసభ్యంగా ప్రవర్తించిన హర్యానా బిజెపి మంత్రి సందీప్ సింగ్‌ను కూడా తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐసిఇయు అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, ఎపి స్టేట్ వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ జి.సూర్యప్రభ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యాన..

ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీతల్ మదన్ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా రెజ్లర్లకు మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ గాజువాక ఇన్‌చార్జి కాళ్ల లోకనాథం, స్టేట్ జాయింట్ సెక్రటరీ నిమ్మకాయల భాస్కరరావు, జిల్లా ప్రెసిడెంట్ ఇ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిడిఎస్ఒ ఆధ్వర్యాన..

ఎంవిపి.కాలనీ : పిడిఎస్ఒ ఆధ్వర్యంలో మద్దిలపాలెం వద్ద నిరసన తెలిపారు. సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్ మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, పాల్గొన్నారు

విశాఖ పోర్టు రికార్డు ప్రగతి

లాండ్ లార్డ్ పోర్టును చేయడంలో భాగంగా రూ.655 కోట్ల విలువైన మూడు పిపిపి ప్రాజెక్టు పనులను అప్పగించారు. మరో రెండు ప్రాజెక్టులు అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉన్నాయి. ఇంకా పలు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

కెకె లైన్‌లో భారీగా రైళ్ల రద్దు

రద్దు చేశారు. 08551 విశాఖపట్నం-కిరండూల్ ప్రత్యేక ప్యాసింజర్, 08528 విశాఖపట్నం-రాయ్‌పూర్ ప్రత్యేక ప్యాసింజర్, 08546 విశాఖపట్నం-కోరాపుట్ ప్రత్యేక ప్యాసింజర్ రైళ్ళను ఈ నెల 26 నుంచి మే 29 వరకూ రద్దు చేశారు. 08552 కిరండూల్-విశాఖపట్నం ప్రత్యేక ప్యాసింజర్, 08545 కోరాపుట్-విశాఖపట్నం ప్రత్యేక ప్యాసింజర్, 08527 రాయ్‌పూర్-విశాఖపట్నం ప్రత్యేక ప్యాసింజర్ రైళ్ళను ఈ నెల 27 నుంచి 30 వరకు రద్దు చేశారు. 18512 విశాఖపట్నం-కోరాపుట్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 26, 29 తేదీల్లోనూ, 18511 కోరాపుట్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను 27, 30 తేదీల్లోనూ రద్దు చేశారు.

శరత్‌బాబు మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్రలోని ఆముదాలవలసకు చెందిన సహజ సీనియర్ నటుడు శరత్‌బాబు మృతిపట్ల వైజాగ్ ఫిల్మ్ సొసైటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు సొసైటీ నిర్వాహకులు నరవ ప్రకాశరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 10.45 గంటలకు ఎయు హిందీ భవన్ ఆవరణలో సంతాప సభ నిర్వహించనున్నట్టు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P.147/2021 in O.S.641/2018

Between :
Smt. Samanthula Ramanamma . . . D.Hr/Plaintiff
And:
Baduri Anjaiah . . . J.Dr/Defendant

NOTICE

To,
J.Dr: Baduri Anjaiah,
S/o. Ankamma, Hindu,
working as Senior Assistant,
Employee No. 010333,
C.M.E. Department,
Visakhapatnam Port Trust,
Visakhapatnam.
R/at. Port Quarters,
Saligramapuram,
Visakhapatnam.

Please take notice that the above named D.Hr/Plaintiff has instituted the above case against you and the E.P. stands posted to **13-06-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **13-06-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

A.SURESH KUMAR,
Advocate
Visakhapatnam,
Cell: 98481 46939

కనీస పింఛను రూ.9 వేలుకు పెంచాలి

పోస్టాఫీసు ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి -తగరపువలస : కనీస పింఛను రూ.9వేలుకు పెంచాలని, 3 డిఎలు వర్తింపచేయాలని, పింఛనుదారులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, రైల్వే ఛార్జీల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చిట్టివలస పోస్టాఫీసు ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. చిట్టివలస ప్రాంతీయ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పింఛను దారుల సంఘం ఆధ్వర్యాన ప్లకార్డులు చేత బూని పింఛను దారులు ధర్నాలో పాల్గొన్నారు. ప్రధానమంత్రికి పోస్టుకార్డుల ద్వారా తమ సమస్యలను తెలియజేసినట్లు సంఘం గౌరవాధ్యక్షులు మావూరి వీర్రాజు, అధ్యక్షులు అల్లు బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రసాద్, సహాయ కార్యదర్శి దామోదర బాబాజీ, కానూరి రాంబాబు, ఆర్.ఈశ్వరరావు, నూలు ఆదినారాయణ, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పల నాయుడు పింఛనుదారులకు సంఘీభావం తెలిపారు. ముందుగా చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి జంక్షన్ మీదుగా పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. పోస్టు మాస్టార్‌కు వినతిపత్రం అందించారు.

తగరపువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న పింఛనుదారులు

నివాళులర్పిస్తున్న రమణి తదితరులు

సిపిఎం సానుభూతిపరురాలు పోలమ్మ మృతి

ప్రజాశక్తి-సింహాచలం: జివిఎంసి 98 వార్డు పరిధి కొండపై సింహగిరి గిరిజన కాలనీలో నివసిస్తున్న సిపిఎం సానుభూతిపరురాలు జమ్మి పోలమ్మ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె గిరిజనుల సమస్యలపై నిరంతరం పోరాటంలో పాల్గొనే వారని, ఆమె మృతి పార్టీకి తీరని లోటు అని పార్టీ సెంట్రల్ కమిటీ నాయకులు జ్యోతిరావు అన్నారు. సిపిఎం పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణి, గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకటరావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు టీవీ.కృష్ణంరాజు, పి.సత్యనారాయణ, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంవి.ప్రసాద్, పి.సూర్యకాంతం, జయమ్మ తదితరులు పోలమ్మ భౌతికకాయాన్ని సందర్శించారు. ఆమె పార్థివదేహంపై పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని పెద్దిపాలెం, పొడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, కుసులవాడ, జగ్గురాజుపాలెం, జగన్నాథపురం, వెంకటాపురం బీపీ కల్లాలు, పల్లిపేట గ్రామాలకు బుధవారం ఉదయం 8 నుంచి ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎయు కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో జరుగుతున్న పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మంగళవారం పరిశీలించారు. విభాగంలో జరుగుతున్న ఎంబిఎ రెండవ సెమిష్టర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పటిష్టంగా నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం ఏయూ అభివృద్ధి చేస్తున్న కెవి.గోపాలస్వామి ఆరుబయట రంగస్థలాన్ని సందర్శించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించి, తీర్చిదిద్దుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. కళలకు, నాటక రంగానికి పెద్దపీట వేసే విధంగా విసి ప్రసాదరెడ్డి పనిచేస్తున్నారని నారాయణమూర్తి ప్రశంసించారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్ పేరును సార్ధకత తీసుకువచ్చే విధంగా అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో

ఎయు విసితో నారాయణమూర్తి

ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు.

విటథాన్ టీషర్టు ఆవిష్కరణ

విటథాన్ రన్ టీ షర్టును ఆవిష్కరిస్తున్న హాకీ ఛాంపియన్స్ కీర్తి, అజయ్ కుమార్ వర్మ, నిర్వాహకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎల్‌వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యాన ఈ నెల 28న బీచ్ రోడ్డులో నిర్వహించే విటథాన్ రన్ రెండవ ఎడిషన్‌కు సంబంధించి టి- షర్టు, పతకాన్ని ఆసుపత్రిలోని జిఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ రోలర్ హాకీ ఛాంపియన్స్ గాదిరాజు కీర్తి, గాదిరాజు అజయ్ కుమార్ వర్మ ఆవిష్కరించారు. పిల్లల్లో సంభవించే రెటోనాబ్లాస్టోమా కంటి కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడం, పిల్లలకు ఉచితంగా చికిత్స అందించేందుకు నిధుల సేకరణలో భాగంగా ఏటా విటథాన్ రన్ నిర్వహిస్తుంటారు. ఈ రన్‌కు వైజాగ్ రన్నర్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మద్దతు ఇస్తుంటాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పిల్లల్లో వచ్చే రెటోనాబ్లాస్టోమా కంటి కేన్సర్ మూడేళ్లలోపు పిల్లల్లో ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించ గలిగితే పిల్లల జీవితాన్ని, కంటిని కాపాడవచ్చన్నారు. ఈ చికిత్స వ్యయంతో కూడుకున్నది కావడంతో అవసరమైన పిల్లలకు ఉచితంగా చికిత్సను అందించేందుకు నిధులు సేకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు పిజె.శ్రీనివాస్, సాగర్ దుర్గా హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ బాపరావు, వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణ, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ క్యాంపస్ హెడ్ డాక్టర్ భవిక్ ఉత్తమ్ పంచాల్, డాక్టర్ నేహా ఘెస్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ మట్టిని అమ్ముకుంటున్నారంటూ ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : పాండ్రంగి గ్రామ కాలువలో ఉన్న మట్టిని వైసిపి నాయకులు అక్రమంగా అమ్ముకుంటున్నారని ఆర్‌డిఓ భాస్కర్‌రెడ్డికి ఆ గ్రామానికి చెందిన ఒకటవ వార్డు సభ్యులు మహంతి శ్రీను ఫిర్యాదు చేశారు. వైసిపి నాయకులు, పిఎసిఎస్ అధ్యక్షులు అమూజూరి అప్పారావు, ఎంపిటిసి నారాయణమ్మ భర్త రమణ కలిసి పొలంలో ఉన్న సాగునీటి కాలువులో ఉన్న మట్టిని అక్రమంగా అమ్మకాలు చేసి నిధులు పోగు చేసుకుంటున్నారని, వీటిని అరికట్టాలని కోరారు. ఈ మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని వివరించారు. ఇటుక బట్టీల నుంచి వస్తున్న కాలుష్యం వల్ల వ్యవసాయ పంటల దిగుబడి తగ్గిపోయిందని తెలిపారు. పదేళ్ల క్రితం ఎకరా వరి, మొక్కజొన్న పంటలు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వివరించారు.

మార్కెట్ వాల్యూ పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : జూన్ 1వ తేదీ నుంచి పెరగబోతున్న మార్కెట్ వాల్యూను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మధురవాడ సబ్ రిజిస్టర్ మోహనరావుకు మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నక్కా శ్రీధర్ ఆధ్వర్యాన మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నక్కా శ్రీధర్ మాట్లాడుతూ, ఇప్పటికే భవననిర్మాణ రంగం కుదేలైందని, నిర్మాణ రంగాన్ని నమ్ముకున్న వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో మార్కెట్ వ్యాల్యూను పెంచి నిర్మాణరంగంపై మరింత భారం మోపవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోతిన శివ, కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, కె.రామకృష్ణారావు, ఆర్‌వై.కుమార్, అల్లాడ వెంకటరావు, జిఎస్.రెడ్డి. పి.కృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వెయ్యి కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ కమిషనరేట్ పరిధిలో వెయ్యి కిలోల గంజాయి పట్టుకున్నట్టు నగర పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ వర్మ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఆనందపురం జంక్షన్ వేముల వలస ఫ్లైఓవర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా 25 గోనె సంచుల్లో వెయ్యి కిలోల గంజాయి లభ్యమైందన్నారు. రెండు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రధాన నిందితులు చెల్లూరు మోహన సూర్యం, అనపర్తి ప్రసాద్, పల్లెల లోవరాజు, వంతల రాజబాబు, వంతల సూరిబాబులను అరెస్ట్ చేశామన్నారు. వీరంతా అల్లూరి జిల్లా చింతపల్లి మండలానికి చెందిన వారని పేర్కొన్నారు. అల్లూరి జిల్లాకు చెందిన కంచరపేట, సువాపల్లి గ్రామాల్లో వీరు గంజాయి కొనుగోలు చేసి తమిళనాడు వ్యాపారులకు విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు.

113 కేజీల గంజాయి స్వాధీనం

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేటలో మంగళవారం సినీ పక్కిలో గంజాయి రవాణా చేస్తున్న కారును పోలీసులు వెంబడించి 113 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుచ్చయ్యపేట ఎస్ఐ కుమార్ స్వామి కథనం ప్రకారం... మంగళవారం మధ్యాహ్నం గంజాయితో కారు వస్తున్నట్లు సమాచార రావడంతో చెరుకు కాటా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వడ్డాది వైపు నుండి కేరళ రిజిస్ట్రేషన్ గల కేఎల్ 51జి 0028 నెంబర్ గల కారు వేగంగా వస్తోంది. పోలీసులు రోడ్డుకడ్డంగా ఉండడంతో డ్రైవర్ పక్కనే ఉన్న పంట పొలాల్లోకి పోనిచ్చాడు. వెంటనే అందులో ఉన్నవారు పరారయ్యారు. సమీపంలోని తోటలు, పొలాలను గాలించినా ప్రయోజనం లేదు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా 67 ప్యాకెట్లలో 113.9 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి దానిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. పరారైన నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని శ్రీకాకుళం, విశాఖలోని ఎన్ఎడి, తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన నలుగురు సభ్యుల ముఠాను నగర పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ వర్మ వివరాలను వెల్లడించారు. ఈ నెల 6 రాత్రి విశాఖపట్నంలోని గణేష్ నగర్ వాసవి పేరడైజ్ అపార్టుమెంట్‌కు చెందిన బందెల సూర్య సాహిత్య తెల్లవారుజామున తమ ఇంట్లో ఎవరో ప్రవేశించి ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి వస్తువులను దొంగలించారని ఎయిర్‌పోర్టు క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ అనంతరం నగరంలోని ఆరు కుళాయిల జంక్షన్‌కు చెందిన శీల అనిల్ కుమార్, శీల రమణి, గుర్జాపు గురుమూర్తిలతోపాటు శ్రీకాకుళానికి చెందిన తట్టా లక్ష్మణరావును నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీకి గురైన రూ.5 లక్షలా 80 వేలు విలువైన 15.5 తులాల బంగారం, 250 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. విచారణ సమయంలో వీరు గతంలో మెదక్, శ్రీకాకుళం జిల్లాలలో పలుచోరీ కేసులలో నిందితులుగా ఉన్నట్టు గుర్తించారు. గతంలో చేసిన దొంగతనాలకు సంబంధించి 39.7 గ్రాముల బంగారం, రెండు టివిఎస్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- కొత్తకోట : రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన పడాల గణేష్ (23) మంగళవారం రాజమండ్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు అందిన సమాచారం మేరకు వివరాలివి. టి.అర్జాపురం గ్రామానికి చెందిన పడాల గణేష్ (23) మూడు నెలల కిందట నాగమణితో పెళ్లి జరిగింది. రాజమండ్రి సమీపంలో ముకుడి గ్రామంలో గల చిన్న అత్త గారింటికి భార్య నాగమణితో వెళ్లిన గణేష్, అక్కడ స్నేహితులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రగాయాలపాలై మృతి చెందినట్లు సమాచారం అందింది. పెళ్లి పందిరి తీయక ముందే గణేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గణేష్ తండ్రి కూడా కొద్దినెలల క్రితమే మృత్యువాత పడ్డాడు.

పెద్దేరులో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది పెద్దేరు నదిలో కస్పా గ్రోయిన్ రాళ్లకట్టు వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుని తల, ముఖంపై బలమైన గాయాలున్నాయి. స్థానికుల సమాచారం మేరకు బుచ్చయ్యపేట ఎస్సై కె.కుమారస్వామి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి వివరాల సేకరించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సమీప పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి వయస్సు 30 నుండి 40 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

'కేంద్ర పాలకులతో చరిత్ర వక్రీకరణ'

ప్రజాశక్తి-సీతమ్మధార : మనుధర్మశాస్త్రం పునరుద్ధరించేందుకు కేంద్ర ఫాసిస్టు పాలకులు చరిత్రను వక్రీకరిస్తున్నారని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్ ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర విద్యా సదస్సు, హేతుబద్ధీకరణ సాకుతో సిలబస్ నుంచి శాస్త్రీయ చారిత్రక పాఠ్యాంశాల తొలగింపు అంశంపై కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, మనుధర్మశాస్త్రం 80 శాతంగా ఉన్న శూద్రులకే కాక అగ్రకులాలతోపాటు అన్ని సామాజిక వర్గాల్లోని మహిళలకు వ్యతిరేకమైందన్నారు. 2024లో బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి మనుధర్మశాస్త్రాన్ని అమలులోకి తెస్తామని సంఘ పరివార్ శక్తులు బహిరంగంగానే ప్రకటిస్తున్నాయని తెలిపారు. ఇదే మరధర్మశాస్త్రం అమలైతే పౌరుల ప్రాథమిక హక్కులకు పుచీలేని ఫాషిష్ట పాలన రావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు లౌకిక, ప్రజాస్వామిక, సౌమ్యవాద లక్ష్యాలతో రూపొందించుకున్న రాజ్యాంగం అమలులో లేనప్పుడు బహుళ ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడుతుందని పేర్కొన్నారు. చివరికి సైన్స్ పాఠం నుంచి జీవపరిణామ సిద్ధాంతాన్ని కూడా తొలగించారని, మూఢనమ్మకాలను పెంచే ఉద్దేశం బలంగా ఉందని ఆరోపించారు. దేశంలో కార్మిక, కర్షకులతోపాటు ఉపాధ్యాయులు పౌర సమాజం పట్ల బాధ్యతతో ఈ ఫాసిస్టు చర్యలను బహిర్గతం చేసి రాజ్యాంగ పరిరక్షణకు పూనుకోవాలని కోరారు. ఎపి విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్, అఖిలభారత విద్యా హక్కు వేదిక అధ్యక్షకార్యదర్శులు రమేష్, పట్నాయక్ మాట్లాడుతూ, కేంద్రం తానా అంటే రాష్ట్రం తందనా అంటుందని విమర్శించారు. కేంద్రం నిర్ణయాలను అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వంతపాడుతోందన్నారు. సదాశివరావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఎపిటిఎఫ్, డిటిఎఫ్, పిడిఎస్‌యు సంఘాల నాయకులు ఎస్.నాయుడు, సేవియర్‌రెడ్డి, వీరభద్రరావు, అభిశ్రీ, వినోద్ కుమార్, సాయిప్రసాద్, కొల్లి రాజు, ధనుంజయ్, కోత ధర్మారావు, ఆర్.కృష్ణ, సిహెచ్‌వి రమణ, కొల్లి సత్యం, అల్లం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మోనియా లీకేజీ నియంత్రణపై నేడు అవగాహన

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి ములగాడలో బుధవారం ఉదయం 11 గంటలకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యాన 'అమ్మోనియా లీకేజీ - నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కోరమండల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు పేర్కొంది. మాక్‌డ్రిల్ సందర్భంగా కంపెనీ నుంచి సైరన్ వేస్తామని, ప్రజలు ఎవరూ ఆ సైరన్ గురించి ఆందోళన చెందనవసరం లేదని తెలిపింది. ఈ మాక్ డ్రిల్‌పై కలెక్టర్‌కు, తహశీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌కు, లోకల్ సచివాలయానికి, కోరమండల్ కంపెనీని అనుకొని ఉన్న గ్రామాల పెద్దలకు, మీడియా మిత్రులకు, స్థానిక కార్పొరేటర్‌కి తెలియజేస్తున్నట్లు పేర్కొంది.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి

ఆటోనగర్‌లో చలివేంద్రం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ ఎ బ్లాక్ లో ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిని దృష్టిలో పెట్టుకొని ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సిహెచ్ సత్యనారాయణ, వాసవి ఉపాధ్యక్షులు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

జగన్‌కు వివాహ ఆహ్వానపత్రికను అందిస్తున్న చొక్కాకుల కుటుంబీకులు

సిఎం జగన్‌కు చొక్కాకుల వివాహ ఆహ్వానం

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రికను విశాపిపిపిఅర్ యుడిఎ చొక్కాకుల లక్ష్మీవెంకటరావు అందించారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో జగన్మోహన్‌రెడ్డిని కలిసి తమ కుమారుడు అనీల్‌కుమార్ వివాహానికి వచ్చి ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సబ్బవరం వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద, చొక్కాకుల అనిల్, ఆశిష్ ఉన్నారు.

చంద్రబాబును కలిసిన వెంకట అప్పారావు యాదవ్

చంద్రబాబును కలిసిన వెంకట అప్పారావు

ప్రజాశక్తి -ములగాడ : ఇటీవల పెందుర్తి వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడును టిఎన్‌టియుసి విశాఖ పార్లమెంట్ కార్యదర్శి, స్టీల్ సిటీ గాజువాక బాలకృష్ణ ఫ్యాన్స్ కార్యదర్శి బొట్ట వెంకటఅప్పారావు యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందుకు సహకరించిన పెందుర్తి తెలుగు యువత నాయకుడు దాసరి గణేష్‌కు వెంకట అప్పారావు ధన్యవాదాలు తెలిపారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార, సత్యం జంక్షన్, హెచ్‌బి.కాలనీ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగించినట్లు టిపిఎస్ తేజ తెలిపారు. పోస్టర్లను కూడా తొలగించినట్లు పేర్కొన్నారు. ఫుట్‌పాత్ వ్యాపారాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని వ్యాపారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

డెంగీ రహిత విశాఖకు సహకరించండి

ప్రజాశక్తి -ములగాడ : సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్ గునియా వ్యాధుల రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ కోరారు. పబ్లిక్ హెల్త్ ఎడిసి విశ్వనాథ సన్యాసిరావు పర్యవేక్షణలో బయాలజిస్ట్ చక్రవర్తి సారధ్యంలో మలేరియా డి.రవికుమార్ తమ సిబ్బందితో రక్షిత మంచినీటి పథకాల ట్యాంకుల పరిశీలనకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, వాతావరణంలో మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డాబాలపై ఉన్న ట్యాంక్‌లను నిత్యం శుభ్రపర్చుకోవాలన్నారు. ట్యాంక్‌లపై మూతలు ఉండేలా చూసుకోవాలని కోరారు. పలు ప్రాంతాలలో మంచినీటి ట్యాంక్‌లలో డెంగీ కారక దోమలను గుర్తించి వాటిని నిర్మూలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్లు దుల్లా శ్రీనివాసరావు, విజయకుమారి, కృపామణి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విమాననగర్‌లో నాగుపాము కలకలం

ప్రజాశక్తి- కరాస: జివిఎంసి 90వ వార్డు పరిధి విమాననగర్ లైన్‌లో నివాసముంటున్న ఎన్ఎస్‌టిఎల్ ఉద్యోగి నూనెల వెంకటేశ్వరరావు ఇంట్లో నాగుపాము కలకలం రేపింది. దీనికి సంబంధించి వెంకటేశ్వరరావు కథనం ప్రకారం... ఎక్కడి నుంచో వచ్చిన నాగుపాము శనివారం నేరుగా బాత్రూంలోనికి ప్రవేశించి కమోడులో దూరిపోయింది. స్థానికులు పామును బయటకు పంపించే ప్రయత్నం చేసినా సఫలీకృతం కాలేదు. దీంతో కమోడులో గుడ్డలు కుక్కి తలుపులు వేశారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రెండు రోజులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అనంతరం స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. సోమవారం ఆయన పాము ఉన్న ఇంటికి వచ్చి పరిశీలించారు. చాకచక్యంగా బయటికి తీసి బంధించారు. ఇళ్లల్లోకి పాము ప్రవేశిస్తే తక్షణమే తన నెంబర్‌కు 98491 40500 ఫోన్ చేయాలని సూచించారు. పాములను పట్టుకుని అడవుల్లో విడిచిపెట్టడం గానీ జూ అధికారులకు అప్పగించడం కానీ చేస్తున్నామని తెలిపారు. ఎన్ఎస్‌టిఎల్ ఫైర్ సిబ్బంది కె.కరుణ్‌కుమార్, అజయ్, పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ పండగ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటావానిపాలెంలో దుర్గమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. జనసేన నాయకులు రఘు సోమశేఖర్ నాయుడు, పిన్నింటి పార్వతి, డిప్యూటీ మేయర్ శ్రీధర్ అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జివిఎంసి సమ్మర్ క్యాంపులు ప్రారంభం

ప్రజాశక్తి-యంత్రాంగం

జివిఎంసి ఆధ్వర్యాన పలు వార్డుల్లో మంగళవారం సమ్మర్ క్యాంపులను ప్రారంభించారు.

ఉక్కునగరం : 78వ వార్డులో సమ్మర్ క్యాంపును కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రారంభించారు. వాలీబాల్, మహాత్మ గాంధీ పార్క్ వద్ద కరాటే, ఉక్కునగరం త్రిష్ట గ్రౌండ్స్‌లో బాక్సింగ్ శిక్షణను అందిస్తారని, క్రీడలపై ఆసక్తి ఉన్న బాలబాలికలు ఉపయోగించుకోవాలని డాక్టర్ బి.గంగారావు కోరారు. సమ్మర్ క్యాంపునకు హాజరై విద్యార్థులకు అల్పాహారం అందిస్తారని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులకు గుర్తింపి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. మే డే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సాయంత్రం సిడబ్ల్యుసి -1లో కండక్టర్ టూర్నీ తదితర కళాకారులతో ప్రజలలో పోరాట స్ఫూర్తిని కలిగించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి జోన్-6 సూపరింటెండెంట్ రమణ, స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, సిఐటియు నాయకులు మొహిద్దీన్, రమణమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26 వార్డు పరిధి ఎన్జీవోస్ కాలనీలో సమ్మర్ క్యాంపును టిడిపి కార్పొరేటర్ ముక్కా శ్రావణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షుడు ముక్కా కిషోర్‌కుమార్, జివిఎంసి ఇఇ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, క్రీడాకారులు, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

25వ వార్డులో వైసిపి కార్పొరేటర్ సారిపల్లి గోవింద సమక్షంలో సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ములగాడ : 40వ వార్డు షిప్‌యార్డ్ జీవీ నిలయం గ్రౌండ్‌లోను, జివిఎంసి గాంధీగ్రాం స్కూల్లోనూ సమ్మర్ క్యాంపులను ప్రారంభించారు. బాక్సింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్, షటిల్ క్రీడా శిబిరాలను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, వై ఎ స్ ఆర్ టి యు ఎ ని షిప్‌యార్డు ప్రధాన కార్యదర్శి చంటిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ ట్రైనర్ రామారావు, సాహూ, శ్రీనివాసరావు, నీరజ, రాజాబాబు, వరపల మహేష్, మీసాల సత్యనారాయణ, దండి శ్యామ్, పెంట్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిబిరం ప్రారంభంలో క్రీడాకారులతో కార్పొరేటర్ గంగారావు

గాజువాక : 72వ వార్డు పరిధి అమరావతి పార్క్‌లో కార్పొరేటర్ స్టాలిన్ సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి రాము, ఎస్ఒ వనజ, స్థానిక పెద్దలు రమేష్ నాయుడు, బలివాడ సత్యారావు, జి.ఆనంద్, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

66వ వార్డు పరిధి బీసీ రోడ్డులో భారత్ షోటో గోజేరియో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యాన సమ్మర్ క్యాంప్‌ను వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్ ప్రారంభించారు. విద్యార్థులకు డ్రెస్సును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ స్పెషల్ ఆఫీసర్ గణపతిరావు, ఎఎస్ఎం లక్ష్మి, శానిటేషన్ సెక్రటరీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డులో వేసవి క్రీడా శిబిరాలను మంగళవారం ప్రారంభించారు. వాలీబాల్, క్రికెట్, కిక్‌బాక్సింగ్ పోటీలను వైసిపి వార్డు అధ్యక్షులు కెల్ల సత్యనారాయణ, జివిఎంసి వేసవి క్రీడల ప్రత్యేక అధికారి అప్పాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడలు పిల్లల్లో శారీరక ఎదుగుదల, మానసికోల్లాసం పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనే విద్యార్థుల పోషకాహారం కోసం ఉడక బెట్టిన గుడ్డు, పాలు, బిస్కెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ ఎఎన్ఎంలు, కోచ్‌లు పాల్గొన్నారు.

అనకాపల్లి : జివిఎంసి 82వ వార్డు ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం కరాటే వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ, స్థానిక కార్పొరేటర్ మందపాటి సునీత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవీఎంసీ ఆధ్వర్యంలో అనకాపల్లి జోన్ పరిధిలో 20 క్రీడా శిబిరాలు ప్రారంభించినట్లు చెప్పారు. సుమారు 600 మంది క్రీడాకారులకు 15 రోజులు పాటు ఉచితంగా శిక్షణ, పోషకాహారాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్ వెంకటరమణ, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, 81వ వార్డు నాయకులు కొణతాల భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కార్పొరేటర్ మందపాటి సునీత, జానకిరామరాజు సత్కరించారు. గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో టెన్నికాయిట్ శిక్షణ శిబిరాన్ని కార్పొరేటర్ సునీత ప్రారంభించారు.

మహిళా రెజ్లర్లకు మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మోసయ్యపేట గ్రామంలో మంగళవారం రాత్రి సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. బ్రిజ్ భూషణ్‌పై పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద గత 25 రోజులుగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఐద్వా కార్యదర్శి ఆర్.లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.సోమినాయుడు మాట్లాడుతూ దేశానికి అవార్డులు తెచ్చిపెట్టిన అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భారత స్టార్ మహిళ రెజ్లర్లు లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. రెజ్లర్లు రాజకీయం చేస్తున్నారని తప్పుతోవ పట్టించడం దుర్మార్గమన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్, హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, వారిని అన్ని ప్రభుత్వ పదవులు నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మూర్తి , దూళి వెంకయ్య నాయుడు, రాము, రెడ్డి, శ్రీనివాసరావు, స్కేటింగ్ కోచ్ బోండా ధర్మేంద్ర, ఆర్ భువన, అరుణ్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

నేరాల అదుపునకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో నేరాల అదుపునకు సిబ్బంది సహకారంతో కృషి చేస్తున్నట్లు ఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో 19 గంజాయి కేసులు నమోదు చేసి రూ.18,69,200 విలువచేసే 934 కిలోల గంజాయి, ఆరు వాహనాలు, 34 సెల్ ఫోన్లు, రూ.12,700 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వివిధ కళాశాలలు, పాఠశాలల్లో 136 యాంటీ డ్రగ్ కమిటీలను వేయడం జరిగిందన్నారు. 31 ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ కేసులు, 20 మద్యపాన కేసులు, 33 జూదపు కేసుల్లో 164 మందిని అరెస్టు చేసి రూ.2,11,520 నగదు, 11 కోడిపుంజులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ట్రాఫిక్ ఎంఫోర్మెంట్లో భాగంగా 18,680 కేసులు నమోదు చేసి అపరాధ రుసుము కింద రూ.46,82,585 వసూలు చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 949 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. పోక్సో కేసులో 12 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి నిందితునికి జైలు శిక్షణ, జరిమానా, బాధితురాలికి లక్ష రూపాయల నష్టపరిహారం అందించడంలో కృషి చేసిన దిశ డిఎస్‌పి మల్ల మహేశ్వరరావు బృందానికి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె కృష్ణకు అభినందనలు తెలియజేసి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, నర్సీపట్నం ఏఎస్పీ కే ప్రవీణ్ కుమార్, అనకాపల్లి డిఎస్పి సుబ్బరాజు, పరవాడ డిఎస్‌పి కెవి సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పి పి శ్రీనివాసరావు, సిబలు చంద్రశేఖర్ లక్ష్మణమూర్తి, అప్పలనాయుడు, సతీష్, వెంకటరావు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

దేవాదాయశాఖ భూముల్లో నివాసముంటున్న వారి

సమస్యను పరిష్కరిస్తా : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-కె.కోటపాడు : దేవాలయ భూముల్లో నివాసముంటున్న లంకవానిపాలెం గ్రామస్తులకు దేవాదాయ శాఖ నుండి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు హామీ ఇచ్చారు. మండలంలోని లంకవానిపాలెం గ్రామంలో ఉన్న శ్రీసదానంద విజయకేశవ దేవస్థానం పరిధిలో కొన్ని వేల ఎకరాలు ఉన్నాయి. ఆ భూముల్లో లంకవానిపాలెం గ్రామం మొత్తం ఉంది. ఎప్పటి నుండో ఆ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్నారు. పంచాయతీ పన్నులు కూడా చెల్లించుకుంటున్నారు. ఇటీవల కొందరు నిర్మాణాలు విషయమై గొడవలు పడి దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో దేవాదాయ శాఖ అధికారులు గ్రామ సరిహద్దులను పరిశీలించి ఒక్కొక్కరికి నోటీసులు జారీ చేస్తుంది. గ్రామంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదని ఈఓ శ్రీనివాసరావు గ్రామస్తులను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామ సర్పంచ్ వేచలపు దొరబాబు గ్రామస్తులతో కలిసి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుని మంగళవారం కలిసి సమస్యను వివరించారు. గ్రామ విషయమై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఈర్ల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం

ప్రభుత్వ సదుపాయాలను, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చోడవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏడువాక సత్యారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల చోడవరంలో జాతీయ మేధో పరవైకల్య సాధికారత సంస్థ, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సమన్వయంతో మానసిక వికలాంగులకు బోధనోపకరణ సామాగ్రి అందజేత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైకల్యానికి ప్రధాన కారణాలు మేనరిక వివాహాలు, తక్కువ వయసులో వివాహం చేసుకోవడమేనని, వాటిని నివారించినట్లయితే మెరుగైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ బోధనో పకరణ సామాగ్రి ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలకి బోధించాలని కోరారు. జాతీయ మేధోపర వైకల్య సాధికార సంస్థ ప్రతినిధులు కె సుజిత్ మాట్లాడుతూ మొత్తం అనకాపల్లి జిల్లాకు 309 కిట్లు మంజూరైట్లు చెప్పారు. ఒక్కొక్క కిట్టు ధర సుమారుగా రూ.10 వేలు ఉంటుందన్నారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి శకుంతల మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఇటువంటి శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అమ్మాజీ, పాఠశాల కమిటీ చైర్మన్ కుమారి, వైస్ ఎంపీపీ గంగరాజు, కుమార్ ఈశ్వరరావు, సత్యారావు, నాగేశ్వరరావు, శ్రీకాంత్, ప్రత్యేక ఉపాధ్యాయులు బి.ఎ.రాజు, మహాలక్ష్మి నాయుడు, దేముడుబాబు, సహిత విద్యా రిసోర్స్ పర్సన్స్ పి.నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు వికలాంగ బాల బాలికలకు చోడవరం భవిత కేంద్రంలో రూ.10 వేల విలువ కలిగిన బోధనోపకరణాల కిట్‌ను అందజేసినట్లు ప్రత్యేక ఉపాధ్యాయులు బిఏ. రాజు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు బి.కాశీ శంకర విశ్వేశ్వర రావు మాట్లాడుతూ బోధనోపకరణాల కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బోధనోపకరణ సామగ్రి అందజేస్తున్న అధికారులు

ఉపాధి కూలీల ధర్నాను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాము

ప్రజాశక్తి - అచ్యుతాపురం

ఉపాధి హామీ కూలీల సమస్యలపై సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న ధర్నాకు పెద్ద సంఖ్యలో కూలీలు హాజరై జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము పిలుపునిచ్చారు. మండలంలో పెదపాడు, ఖాజీపాలెం, హరిపాలెం, కొండకర్ల గ్రామాలలో మంగళవారం ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన రూ.272 ప్రతికూలీకి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కూలీకి 200 పని దినాలు కల్పించాలని, గతంలో వలె వేసవి అలవెన్స్, పనిముట్లకు డబ్బులు ఇవ్వాలని, పని ప్రదేశంలో టెంట్, మంచినీటి సదుపాయం, మెడికల్ కిట్టు కల్పించాలని కోరారు. ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సరగడం కనుమనాయుడు, శ్రీను, రామలక్ష్మి, సత్యవతి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పెతకంశెట్టి 16వ వర్ధంతి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని నాగులపల్లి గ్రామంలో మంగళవారం పార్లమెంటు మాజీ సభ్యులు పెతకంశెట్టి అప్పల నరసింహం 16వ వర్ధంతి స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. టిడిపి మళ్ల సురేంద్ర, స్థానిక టిడిపి నాయకులు అప్పల నరసింహం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీని అంటిపెట్టుకొని ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించుకున్న వ్యక్తి అప్పల నరసింహ అని కొనియాడారు. సమితి అధ్యక్షులుగా, వుడా చైర్మన్‌గా, పార్లమెంటు సభ్యునిగా ప్రజలకు అనేక రూపాల్లో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, పెతకం శెట్టి రాజు నాయుడు, పొలమరశెట్టి నాగు, మళ్ల ధన, పోలమరశెట్టి నూకాలయ్య, మళ్లతేజ, గుల్లేపల్లి సత్తిబాబు, మళ్ల అప్పలనాయుడు, శరగడం సత్యనారాయణ, రాపేటి శ్రీను, పెంటకోట శివ, బాల, కాండ్రేగుల నూకపుల నాయుడు, శరగడం సత్యనారాయణ, భీమిశెట్టి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

పెతకంశెట్టి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం సీతయ్య పేట గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పర్యావరణ, పరిరక్షణలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ బి గౌరీస్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం తగ్గించాలని, నీటి వినియోగం అవసరాలకు మేర చేయాలని, ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీరు నిల్వ చేసుకోవాలని, తడి పొడి చెత్త వేరుగా నిల్వ చేయాలని సూచించారు. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, ప్లాస్టిక్, ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలని కోరారు. రావికమతం మట్టవానిపాలెం, దిబిడి, ఎల్బీపీ అగ్రహారం, కొత్తకోట నర్సరీల ద్వారా మొక్కలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

ఏషియన్ పెయింట్స్ నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఏషియన్ పెయింట్స్ సిఎస్ఆర్ నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు చెప్పారు. మండలంలోని జి ధర్మవరం గ్రామంలో 16.40 లక్షలతో నిర్మించిన కల్వర్టును ఆయన చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏషియన్ పెయింట్స్ తన సిఎస్ఆర్ నిధులతో పలు గ్రామాల్లో మంచినీటి చెరువుల పూడిక తీత పనులు, ఉచిత వైద్య శిబిరం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, సర్పంచ్ నూకరాజు, రామజోగి, కె.విమల నాయుడు, దేశం శెట్టి శంకర్రావు, పిన్నమరాజు వాసు, ఒడిసెల శ్రీనివాసరావు, కోన బుజ్జి, లాలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు, ఛార్జీల పెంపుపై టిడిపి నిరసనలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, విద్యుత్ కోతలను అరికట్టాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యాన మంగళవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి : తెలుగుదేశం అధిష్టానం ఆదేశాల మేరకు స్థానిక ఎపి ఈపిడిసిఎల్ కార్యాలయం వద్ద మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. దీనికి ముందు పార్టీ శ్రేణులు ర్యాలీ చేశారు. ధర్నా అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడ : టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా ఆధ్వర్యాన పరవాడ విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎఇకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీలు, సర్ ఛార్జీలు , ఫిక్స్ ఛార్జీలు పేరుతో పేద ప్రజల మీద అధిక భారాలు మోపడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు దేముడు, నకిరెడ్డి చిన్నారావు, గోర్లి కనకారావు, సురాడ బంగార్రాజు, ఇందల కొండల రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డాది : ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అవినీతి, అసమర్థత వలనే రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు, కోతలు పెరిగిపోయాయని టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు, చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు ఆరోపించారు. మంగళవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి, వడ్డాది కూడలిలో మానవహారం చేశారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంవివి సత్యనారాయణ, కోటేశ్వరరావు, అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, పుప్పాల అప్పలరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి : విద్యుత్ ఛార్జీల పెంపు, అప్రకటిత కరెంట్ కోతలకు నిరసనగా మంగళవారం ఎండలంలోని ఉపమాక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్తు సరఫరా ఎప్పుడు ఇస్తారో తెలియక రైతులు ఎదురుచూసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వంలో హయాంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేశామన్నారు.విద్యుత్తు ఛార్జీలను పెంచి వినియోగదారులపై భారం మోపడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి ,నానేపల్లి రాఘవులు, వైబోయిన రమణ , కొప్పిశెట్టి శ్రీను, మీగడ సత్తిబాబు, కర్రి వెంకట సత్యనారాయణ, ప్రగడ వీరబాబు, దొరబాబు, తాతారావు, సింహాద్రి, గంగరాజు పాల్గొన్నారు .

భీమిలి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నాలో టిడిపి నాయకులు, కార్యకర్తలు

మాడుగుల : విద్యుత్ ఛార్జీల పెంపు, వేళాపాళాలేని కోతలపై టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి కుమార్ అధ్వర్యంలో మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు.. ఈ సందర్బంగా కుమార్ మాట్లాడుతూ వినియోగదారులపై జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలో ఎనిమిదిసార్లు పెంచిన ఛార్జీలతో రూ.57 వేల 158 కోట్లు అదనపు భారం మోపిందన్నారు. ఎడాపెడా విద్యుత్ ఛార్జీల భారం మోపిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు కార్యక్రమంలో ఉండూరు దేవుడు, కసిరెడ్డి అప్పలనాయుడు, సబ్బవరపు రామానాయుడు, జు రెడ్డి రాము ,పుప్పాల రమేష్,అపాన రమణ, అప్పాన భాస్కరరావు ,జల్లి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు

భీమునిపట్నం : స్థానిక కృష్ణా కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట టిడిపి నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ, అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు సంఘం విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డి.ఎ.ఎన్.రాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎస్.అప్పారావు, జివిఎంసి 1, 4 వార్డుల అధ్యక్షులు టి.సూరిబాబు, పాసి నరసింగరావు, పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పతివాడ రాంబాబు, నాయకులు గొలగాని నరేంద్ర కుమార్, కనకల అప్పలనాయుడు, ఎం.సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న, గండిబోయిన పోలిరాజు, తమ్మిన వెంకటరమణ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట పార్టీ మండల అధ్యక్షులు కోరాడ రమణ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని నినదించారు. అనంతరం ఎఇ జగన్మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమములో జడ్‌పిటిసి మాజీ సభ్యులు కశిరెడ్డి దామోదరరావు, టిడిపి మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షులు కురిమిన లీలావతి, నాయకులు గెద్ద ప్రసాద్, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : 90 వార్డు పరిధి భాజీ జంక్షన్‌లోని సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, శరగడం రాజశేఖర్, నాయకులు బొడ్డేటి విజయకుమార్, నారిపిన్ని సత్తిరాజు, నరవ పైడిరాజు, బంగారు తులసీరామ్, కనక కుమార్, ఎలమంచిలి ప్రసాద్, కంపర ఆనంద్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం సబ్ స్టేషన్ ఎదుట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు వానపల్లి ముత్యాలరావు మాట్లాడుతూ, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. అనంతరం ఎఇ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మీసాల సత్యనారాయణ, వానపల్లి ముత్యాలరావు,సురాల సత్య వరప్రసాదరావు, బంటుబిల్లి అప్పలస్వామి, పడాల అప్పలనాయుడు, దుక్క రమణ, ఎర్ర బంగారునాయుడు, దొంతల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ జోన్ 3 విద్యుత్ కార్యాలయం ముందు టిడిపి నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఆనందబాబు గొల్లంగి, విశాఖ పార్లమెంట్ యూత్ ఉపాధ్యక్షులు గరే గురునాథ్, నియోజక మహిళా అధ్యక్షులు బోయి రమాదేవి, జిల్లా కార్యదర్శి నాగోతి సూర్యప్రకాష్, 7వ వార్డు బిసి సెల్ అధ్యక్షుడు పిల్లా రాము, 6వ వార్డు మహిళా అధ్యక్షులు పెంటకోట బబ్బేలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు వైఎస్ఆర్ పశు బీమా పథకంలో చేరాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : రైతులు వైఎస్ఆర్ పశు బీమా పథకంలో చేరాలని పశుసంవర్ధకశాఖ ఎడి బైరాగి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పశువులకు బీమా చెల్లిస్తే వైఎస్ఆర్ పశు బీమా పథకం ద్వారా నష్టపరిహారం అందుతుందని తెలిపారు. సంకరజాతి ఆవు, గేదె, ఎద్దు మరణిస్తే రూ.30 వేలు, దేశవాళీ ఆవు, గేదె, ఎద్దు మరణిస్తే రూ.15వేలు, గొర్రె, మేక, పంది మరణిస్తే రూ.6వేలు బీమా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఒక కుటుంబానికి ఐదు పశువులు, 50 గొర్రెలు లేదా 50 మేకలు ఉంటేనే ఈ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. పాడి పశువులు కనీసం ఒక ఈత ఈని ఉండాలని, గొర్రెలు, మేకలు, పందులకు ఆరు నెలల వయస్సు ఉండాలని తెలిపారు. బీమా చేయబడిన పశువుకు తప్పనిసరిగా చెవిపోగు వేస్తారని, బిపిఎల్‌కు చెందిన కుటుంబాల వారు గేదెకు రూ.384 చెల్లిస్తే మూడు సంవత్సరాలు వర్తిస్తుందని తెలిపారు. గొర్రె లేదా మేకకు ఏడాదికి రూ.36 చెల్లించవలసి ఉంటుందన్నారు. ముఖ్యంగా పశువులు రోడ్డు, రైలు ప్రమాదం, రోగాల బారిన పడినా, పాముకాటు, అగ్నిప్రమాదం, వరదలు తదితర వాటికి మాత్రమే బీమా వర్తిస్తుందని స్పష్టం చేశారు.

నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- వడ్డాది : వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాది కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 103 మంది రోగులకు నేత్ర పరీక్షలు చేశారు. 52 మందిని కంటి ఆపరేషన్ ఎంపిక చేసి విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. ఇందులో పాల్గొన్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ వైయస్సార్ కంటి వెలుగుతో జీవితం సుఖమయం అవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరి చందన, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ అరుణ్ కుమార్, వైయస్సార్ కంటి వైద్య నిపుణులు ఆర్ వెంకట్రావు, కో-ఆపరేటివ్ అధ్యక్షులు దొండా సన్యాసిరావు, వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి కోవెల జనార్దన్‌రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటోమేటిక్ రైల్వే గేట్ ఆన్ ఆఫ్ యంత్రం రూపకల్పన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) కళాశాల 3వ సంవత్సరం డిప్లొమా ఈఈఈ చదువుతున్న విద్యార్థులు ఆటోమేటిక్ రైల్వే గేట్ ఆన్ ఆఫ్ యంత్రాన్ని రూపొందించారు. దీనిని తయారు చేసిన విద్యార్థులు యువశ్రీ కుమారి, జయశ్రీ, శేఖర్, వినయ్ మాట్లాడుతూ ఈ సిగ్నల్ వ్యవస్థ వలన రైల్వే గేట్ దగ్గర ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేదని తెలిపారు. దీని వల్ల కొంత వరకు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. ఈ పరికరం తయారు చేసేందుకు సిగ్నల్ సెన్సార్స్‌తో మోటార్సిగ్నల్ లైట్స్, మోటార్ సర్క్యూట్ ఉపయోగించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టికి గైడ్‌గా శ్రావణ లక్ష్మి వ్యవహరించారన్నారు. ఈ పరికరం తయారు చేయడానికి రూ.1500 ఖర్చు చేసినట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరి రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, హెచ్ఓడి డాక్టర్ గోపాలమ్మ అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితునికి నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి టిఫిన్ షాపు దగ్ధం కాగా, బాధితుడైన వికలాంగుడు శ్రీనివాసరావుకు మంగళవారం మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ నెల రోజులకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. అనంతరం తహశీల్దారు, అగ్నిమాపక సిబ్బందితో మాట్లాడి బాధితునికి తక్షణ సహాయం అందించాలని కోరారు. శ్రీనివాసరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్ని బాలాజీ, మండల అధ్యక్షుడు కాయల మురళి, నాయకులు ఉగ్గిన రమణమూర్తి, పెంటకోట రాము, నైనంశెట్టి రమణారావు, గొంతిన శ్రీనివాసరావు, మజ్జి నానిబాబు, ఎంపీటీసీ షేక్ దర్గా, పోలవరపు త్రినాథ్, ఆనాల తాతియ్య నాయుడు, ఒమ్మి సత్యనారాయణ, పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

ఇప్పటికైనా భూములు స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

నలభై ఏళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 20లో 38 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఈ ఏడాది మార్చి 21న సంపూర్ణమైన తీర్పు వెలువడగా, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం జారీ అయిన నేపథ్యంలో వెంకన్న ఈ ప్రకటన విడుదల చేశారు. కోర్టు తీర్పును అనుసరించి రెవెన్యూ అధికారులు వెంటనే ఆ భూములకు హద్దులు తెల్పి స్వాధీనం చేసుకొని బోర్డులు పెట్టాలని డిమాండ్ చేశారు. గత 40 ఏళ్లగా ఆక్రమణదారులు రెవెన్యూ అధికారులను, కోర్టులను ముప్పుతిప్పలు పెట్టారని, ఈ భూములను తమ ఆధీనంలో ఉంచుకునేందుకు దేవరాపల్లికి నవోదయ స్కూల్, మోడల్ స్కూల్, స్పోర్ట్స్ స్కూల్ మంజూరైనా స్థలాలు లేవని తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి వెనక్కి పంపించారని తెలిపారు. ఈ భూమి వ్యవహారంపై సిపిఎం అనేక ఏళ్లగా పోరాటం చేస్తుందని చెప్పారు. ఇప్పటికైనా ఆక్రమణదారులు రెవెన్యూ అధికారులకు సహకరించి భూములను ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు.

విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న అధికారులు

జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జగనన్న హౌసింగ్ కాలనీలో మంగళవారం విద్యుత్ సరఫరా ప్రారంభించారు. నిర్మాణాలు వేగవంతమై పలువురు గృహప్రవేశాలు చేసిన నేపథ్యంలో కాలనీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సరఫరా చేశారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు వెంకటేశ్వరరావు, పి కాశిబాబు, ఏఈలు రమణ, సోమరాజు, వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో డైట్ విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక అనకాపల్లి డైట్ కళాశాల ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎంకే.లలితేశ్వర రావు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం దక్కించుకున్నారు. తమిళనాడు రాష్ట్రం కోర్టల్లంలో మే 12 నుంచి 17 వరకు జరిగిన జాతీయ సబ్ జూనియర్, జూనియర్ మాస్టర్స్ పురుషుల, మహిళల పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ -2023 పోటీలు జరిగాయి. ఈ పోటీలలో పురుషుల 93 కేజీల జూనియర్ విభాగంలో ఎంకే.లలితేశ్వర్‌రావు జాతీయ స్థాయిలో పదవ స్థానంలో నిలిచాడు. ఇటీవల గుంటూరు జిల్లాలో జరిగిన పోటీల్లో 93కేజీల జూనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ నేపథ్యంలో లలితేశ్వర్‌రావును కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ సి.హెచ్.నరసింహం అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ రామ్ కుమార్, కళాశాల పిడిబి శ్రీనివాస్‌రావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జార్జి క్లబ్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి, డిఆర్‌ఓ వెంకటరమణ, జోనల్ కమిషనర్ వెంకటరమణ, జార్జిక్లబ్ అధ్యక్షులు బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, ఈపిడిఓ దొర, కోచ్ ఎమ్మెన్నెస్ అప్పారావు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన

శాఖాగ్రంథాలయాల్లో వేసవి విజ్ఞానశిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. చిన్నారులకు ఇష్టమైన ఆటపాటలతో పాటు వారిలో విజ్ఞానాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపడుతుండడంతో వారు అధికంగా వస్తుండడంతో విశేష ఆదరణ కనిపిస్తోంది. లైబ్రేరియన్ల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొంటుండడంతో విజ్ఞానభరితంగా సాగుతోంది.

ప్రజాశక్తి -విలేకర్ల యంత్రాంగం

నర్సీపట్నంలో ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తున్న భవానీ

మల్కాపురంలో లైబ్రరీలో విజేతలకు బహుమతులు

నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. లైబ్రరియన్ దమయంతి ఆధ్వర్యంలో 16వ వార్డు సచివాలయ మహిళా పోలీస్ సిహెచ్ భవాని పాల్గొని, ఆడపిల్లలు ధైర్యంగా ఎదుర్కోవలసిన అంశాలపై విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు. స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు. తెలుగు పద్యాలు, తెలుగు కవితలు విజయకుమారి టీచర్ వివరించారు. విద్యార్థులతో పద్యపఠనం చేయించడంతోపాటు మట్టిముద్దలతో బొమ్మల తయారు చేయడాన్ని లావణ్య టీచర్ నేర్పించారు. కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు

గొలుగొండలో దేశభక్తి గేయాల పోటీలు

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి.

గొలుగొండ: విద్యార్థులంతా దేశభక్తిని పెంపొందించుకోవాలని గొలుగొండ గ్రంథాలయ అధికారి రాజబాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు దేశభక్తి గీతాలు, పుస్తక పఠనం, కథలు చెప్పడం, స్పెల్లింగ్ గూర్చి అడగడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో నలుగురు రిసోర్స్ పర్సన్‌లు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో కథలు, పాటలు

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం చిన్నారులు వివిధ రకాల కథలను చెప్పి అలరించారు. బేతాళ, నీతి, జంతువులకు సంబంధించిన కథలను చెప్పి అందరిని ఉత్సాహపరిచారు. కొందరు ఇంగ్లీషులో కూడా కథలను చెప్పారు. అతి చిన్న వయసులో కథలు చెప్పిన వారిని, ఆటపాటలతో అలరించిన వారిని బహుమతులతో సత్కరించారు. అనంతరం జాతీయ సేవా పథకం సీనియర్ వాలంటీర్ అలేఖ్య శిక్షణలో చిన్నారులు నాట్యాన్ని అభ్యసించారు. ప్రతిరోజూ శిబిరంలో చిన్నారులందరికీ మజ్జిగ పంపిణీ చేస్తున్న 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధకు శిబిరం తరుపున ధన్యవాదాలు తెలియజేశారు. ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, కార్మిక నాయకులు బి.సత్యానందం, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథి, గ్రంథాలయ స్థల దాత సన్యాసి మాట్లాడుతూ, క్రమశిక్షణకు, జ్ఞాన సముపార్జనకు ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు. పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బిపి.రాజేంద్రప్రసాద్, టిపికె.వర్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహ, కిరణ్, బి.సూర్యమోహన్, దీప్తి, వర్మ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

పాముకాటుకు గురైన వ్యక్తి మృతి

మృతుడు బాబ్జి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : పాము కాటుకు గురై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మతి చెందిన ఘటన మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో జరిగింది. మంగళవారం ఉదయం స్థానిక పోలీసులకు మృతుడు భార్య పినపాత్రుని మంగ ఫిర్యాదు చేశారు. వివరాలివి. గెడ్డపాలెం గ్రామానికి చెందిన పినపాత్రుని బాబ్జి ఈ నెల ఐదవ తేదీన కూలిపనికి వెళ్ళి, తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో గుర్తు తెలియని పాము కాటుకు గురయ్యాడు, ఇంటికి వచ్చి విషయం చెప్పగా, కుటుంబ సభ్యులు స్పందించి వెంటనే నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తుని, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో మరణించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. యస్ రాయవరం పోలీసులు కేసు నమోదు చేశారు.పోస్టుమార్టం అనంతరం మతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : డివిజన్ పరిధిలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు విద్యుత్ శాఖ ఎస్ఇ మహేంద్రనాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో సమస్యలపై అధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించామని, నర్సీపట్నంలో ఇండోర్ సబ్ స్టేషన్‌కు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.70 లక్షలతో 5 ఎంవిఎ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి మూడు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పట్టణ ప్రజలకు లోవోల్టేజీసమస్య ఉండదన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చింతపల్లి మండలం లంబసింగిలో రూ.12 లక్షలతో నిర్మించిన సర్క్యూట్ బ్రేకరు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

ఈదురుగాలులు, వర్షాల సమయంలో కొమ్ములు విరిగిపడటం, ఇతరత్రా కారణాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా సర్క్యూట్ బ్రేకర్‌లను ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే తెలుస్తుందన్నారు. వెనువెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి, లోవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

ఘనంగా మోదకొండమ్మ జాతర

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం టి.అర్జాపురం చలకవానిపాలెంతో పాటు ఆరు ఆదివాసీ గ్రామస్తులు ఏటా నిర్వహించే గదబపాలెం మోదమాంబ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. వేలాది మంది మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం ఉదయం నుంచే క్యూ కట్టారు. ఉత్సవ కమిటీ చైర్మన్, టి. అర్జాపురం సర్పంచ్ మడగల అర్జున ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వందలాది మంది మహిళలు సంబరంగా ఘటాలు తీసుకువచ్చారు. జాతర సందర్భంగా మంగళవారం రాత్రి ఆయా గ్రామాల్లో పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

క్రీడాకారులకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న టార్గెట్ బాల్ పోటీలకు హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లకు ఉపకార్ చారిటబుల్ ట్రస్టు అధినేత, ఏపి టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు క్రీడా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా అచ్యుతరావు మాట్లాడుతూ, భవిష్యత్‌లో కూడా క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి టార్గెట్ బాల్ హెడ్ కోచ్ సురేష్‌కుమార్, ట్రస్టు సభ్యులు సుధీర్, నాగరాజు, భాస్కర్, నాని, ధనరాజు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు టిడిపి కార్యాలయంలో ఎన్‌.టి.రామారావు శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. స్థానిక ప్రజలకు ఎన్‌టిఆర్ చిత్రపటాలను కార్పొరేటర్ ముక్కా శ్రావణి అందించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ, ఎన్.టి.రామారావు ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు, వార్డు అధ్యక్షులు ముక్కా కిషోర్‌కుమార్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వంద శాతం రాయితీపై వేరుశనగ విత్తనాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : జాతీయ ఆహార భద్రతా పథకం ద్వారా రైతులు 100 శాతం రాయితీపై ఇచ్చిన కదిరి లేపాక్షి వేరుశెనగ విత్తనాలను రైతులు పొలాల్లో వేసుకుని, వాటి ఫలితాలను తెలియజేయాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని వేంపాడు రైతు భరోసా కేంద్రం వద్ద పలువురు రైతులకు కదిరి లేపాక్షి వేరుశెనగ విత్తనాలను అందజేసారు.ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తున్నామని, కావలసిన రైతులు దగ్గర్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు .పచ్చిరొట్ట విత్తనాల వల్ల భూమికి అనేక పోషకాలు లభిస్తాయన్నారు. ముఖ్యంగా చౌడు భూములను బాగు చేసుకోవడానికి పచ్చిరొట్ట ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు .పచ్చిరొట్ట పైర్లతో రసాయన ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు, పర్యావరణహితంగా ఉంటుందన్నారు . పిఎం కిసాన్ ఇకెవైసి నమోదు చేయించుకోని రైతులు, వెంటనే చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది రుఫియా, గాయిత్రి, రాజేష్ , రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పెతకంశెట్టికి నివాళి

ప్రజాశక్తి -గోపాలపట్నం : మాజీ ఎంపీ కీర్తిశేషులు పెతకంశెట్టి అప్పలనరసింహం 16వ వర్ధంతిని ఆయన కుమారుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన నిర్వహించారు. డైమండ్ పార్కు వద్ద గల అప్పలనరసింహం విగ్రహానికి గణబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. గణబాబుతో పాటు పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసులు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : ఇసుక అక్రమ రవాణాదారులపై ఉక్కుపాదం మోపుతామని తహశీల్దారు శ్యామ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం దార్లపూడి వరహానది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ఇసుక బళ్ళను, ధర్మవరం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బళ్ళు ట్రాక్టర్లను స్థానిక పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-ఆనందపురం : గంభీరం పంచాయతీ బోయపాలెం, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో లో-వోల్టేజ్ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కరించాలని ఎఇ సురేష్‌కుమార్‌కు మాజీ సర్పంచ్ వానపల్లి ముత్యాలరావు వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎఇ స్పందిస్తూ పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వాలంటీర్లకు సత్కారం

వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా వాలంటీర్లు పనిచేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మండలంలో రావణాపల్లి సచివాలయంలో సేవా అవార్డులు పొందిన రావణాపల్లి, కొమిర పంచాయతీల వాలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి చైర్మన్ చిటికెల బాస్కరనాయుడు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, లోచర్ల సుజాత , ఎంపిడిఒ డేవిడ్ రాజు, ఇఒపిఆర్‌డి రఘురాం, చోద్యం పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, జక్కు నాయుడు, పంచాయతీ సెక్రటరీ సాధనాల అప్పారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే గణేష్‌ను గొలుగొండ మండల వైసిపి నేతలు సత్కరించారు.

'ఒక్క అవకాశం ఇవ్వండి'

ప్రజాశక్తి గొలుగొండ: రానున్న ఎన్నికల్లో జనసేనకు మద్దతు ఇచ్చి ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని పవన్ కల్యాణ్‌కు ఇవ్వాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన సూర్యచంద్ర కోరారు. మంగళవారం మండలంలో లింగంపేట గ్రామంలో 'జనం కోసం జనసేన' కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, మండల పార్టీ సీనియర్ నాయకులు రేగుబళ్ళ శివ, నర్సీపట్నం మండల పార్టీ నాయకులు అద్దేపల్లి గణేష్, సలాదుల ప్రసాద్, వాసం వెంకటేష్, చిరంజీవి, నారాయణరావు పాల్గొన్నారు.

రాయితీపై పండ్ల మొక్కలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో ఎంపిక చేసిన సన్న, చిన్న కారు రైతులకు వంద శాతం రాయితీపై పండ్ల మొక్కలు పంపిణీకి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో పండ్ల మొక్కల పెంపకానికి ముందుకొచ్చిన సన్న, చిన్న కారు రైతులను గుర్తించే పనిలో అధికారులు, సిబ్బంది ఉన్నారు. తొలత అమనాం, లక్ష్మీపురం గ్రామాల్లో వీటి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. జాబ్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం కలిగిన సన్న, చిన్న కారు రైతులకు మాత్రమే వంద శాతం రాయితీపై మామిడి, జీడి, కొబ్బరి, సపోటా, జామ పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నారు. పండ్ల మొక్కలు వేసేందుకు గుంతలు తవ్వడం మొదలు నీరు పోసే వరకూ అయ్యే ఖర్చులను రోజు వారీ వేతనం రూపంలో సంబంధిత సన్న, చిన్న కారు రైతులకు అందించనున్నట్లు ఎన్ఆర్ఇజిఎస్ అడిషనల్ ప్రోగ్రాం అధికారి జి.వెంకటగౌరి తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. కళాశాలలో మొదటి సంవత్సరం 128 మంది, ద్వితీయ సంవత్సరం 120 మంది పరీక్షలు రాయనున్నారని కళాశాల ప్రిన్సిపల్ ఆర్ గంగరాజు తెలిపారు. మార్చిలో జరిగిన పరీక్షల్లో కళాశాల నుంచి 130 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 9 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 152 మంది పరీక్షలు రాయగా 56 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. వీరంతా ఇపుడు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారు.

26న దేవాలయ భూముల కౌలుకు వేలం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని కొరుప్రోలు గ్రామదేవత నూకాలమ్మతల్లి, సీతారామస్వామి ఆలయాలకు చెందిన సాగుభూములను ఈనెల 26నకౌలుకు వేలంపాట నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం కొరుప్రోలు వచ్చిన వారు రెండు ఆలయాల ట్రస్టీలకు వేలం నిర్వహణ పత్రాలను అందించారు.

నూకాలమ్మతల్లి ఆలయానికి సర్వే నెంబరు 177లో 12.22 ఎకరాలు, 101/4 లో 4.86 ఎకరాలు, 598లో 4.74 ఎకరాల మెట్టు భూములకు, శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందిన సర్వే నెంబరు 304/2 లో 2.14 ఎకరాల పల్లం, 39/4 లో 1.27 ఎకరాల మెట్టు భూములకు 26 వతేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు శ్రీ నూకాలమ్మతల్లి ఆలయం ఆవరణలోను, మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీ సీతారామస్వామి ఆలయం వద్ద వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనే పాటదారులు ఒక్కొక్క సర్వే నంబర్ రూ.ఐదువేలు ధరావత్తు చెల్లించాల్సి వుంటుందన్నారు. దేవస్థానానికి బకాయిలు, ఇతర లావాదేవీలు ఉన్నవారు అనర్హులన్నారు. పాటలో పాల్గొనే వారు రూ.లక్షకు సాల్వెన్సీ సర్టిఫికెట్ తో పాటు ఆధార్కార్డు నకలు కాపీ సమర్పించాలన్నారు. పాట దక్కించుకున్న రైతుల ఒక సంవత్సరం శిస్తు ముందుగా ఆయా దేవస్థానాలకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే మూడు ఖాళీ చెక్కులను దేవాదాయ శాఖకు ఇవ్వాలని సూచించారు. ఇతర సమాచారం కొరకు 91103 57800సెల్నెంబర్కు సంప్రదించాలని సూచించారు.

వాలంటీర్ పోస్టుల భర్తీకి 28లోగా ఆన్లైన్లో దరఖాస్తులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలోని గబ్బాడ సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ జయమాధవి తెలిపారు. ఈనెల 28వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సృజనవాణి విద్యార్థులకు పాలిసెట్లో ర్యాంకులు

ప్రజాశక్తి-మాడుగుల : సృజన వాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పాలిసెట్ శిక్షణ పొందిన విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు ఈ సంస్థ ఆధ్వర్యంలో 12 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులకు వీరవల్లిలోని సంస్థ కార్యాలయంలో ఉచిత పాలిసెట్ శిక్షణ నివ్వగా, వడ్డాదికి చెందిన వై గగన్ తేజ (1798), మాడుగులకు చెందిన ఎన్ ఆకాష్ (1972) మంచి ర్యాంకులు సాధించారు. మరో ఎనిమిది మంది విద్యార్థులు ఐదు వేల లోపు ర్యాంకులు వచ్చాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు


గగన్తేజ

ఆకాష్

నీరుగారుతోన్న అంగన్వాడీల లక్ష్యం!

❖ రెండు నెలలుగా కేంద్రాలకు నిలిచిన పాల సరఫరా
❖ లబ్ధిదారుల అవస్థలు ...పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గొలుగొండ : నిరుపేద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్న అంగన్వాడీల లక్ష్యం నీరుగారిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో రెండు నెలలుగా పాల సరఫరా నిలిచిపోయింది. కాంట్రాక్టర్ల అలసత్వం, అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా నేటికి రెండు నెలల నుంచి అంగన్వాడీ కేంద్రాలకు పాలు సరఫరా కావడం లేదని, దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే పరిస్థితి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 82 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 800 మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహార సేవలు పొందుతున్నారు అంగన్వాడీ కేంద్రాల ద్వారా వీరికి పౌష్టికాహారంలో భాగంగా పాలు, గుడ్లు, శనగఅచ్చులు, బాలామృతం ప్యాకెట్లు ప్రభుత్వపరంగా ఇవ్వాల్సి ఉంది. వీటిని తీసుకోవడం ద్వారా నిరుపేద లబ్ధిదారులంతా పౌష్టికాహార లోపాన్ని, రక్తహీనతను అధిగమించి ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ లక్ష్యం.

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు

రోజుకు మిల్లీలీటర్ల చొప్పున పాలు లబ్ధిదారులకు అందించేలా ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు నెలకు ఐదులీటర్ల పాలు, ఏడవ నెలవరకు వయస్సున్న చిన్నారులకు నెలకు 6 లీటర్లు, మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు నెలకు 5 లీటర్ల చొప్పున ప్రభుత్వం అందిస్తున్నది. అయితే కాంట్రాక్టర్లు అలసత్వంతో రెండు నెలలుగా మండలంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పాల సరఫరా నిలిచి పోయింది. దీంతో లబ్ధిదారులు పాలు సరఫరా జరగక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులకు సరియైన సమాధానం చెప్పలేక అంగన్వాడీ కార్యకర్తలు తలు పట్టుకునే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పాల సరఫరాకు చర్యలు చేపట్టడం ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం సమస్య తలెత్తకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సిడిపిఒ వివరణ

ఈ విషయంపై ఐసిడిఎస్ గొలుగొండ సెక్టార్ ప్రాజెక్ట్ అధికారిని శ్రీగౌరిని వివరణ కోరగా రెండు నెలల నుంచి పాలసరఫరా నిలిచిపోవడం వాస్తవమేనన్నారు. సమస్యపై కాంట్రాక్టర్తో మాట్లాడి ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచామన్నారు బుధవారం నుంచి అంగన్వాడీ కేంద్రాలకు పాలు సరఫరా అయ్యే అవకాశం ఉందనితెలిపారు.

పంట కాలువపై ఆక్రమణలు తొలగించండి

తహశీల్దార్కు ఫిర్యాదు చేస్తున్న ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట, కన్నంపేట రెవెన్యూ పరిధిలో వెయ్యి ఎకరాలకు పైగా సాగునీరందించే ఇరిగేషన్ కాలువ (ఊరకాలువ)పై ఉన్న ఆక్రమణలను తొలగించి తమకు న్యాయం చేయాలంటూ కొత్తకోట, కన్నంపేట గ్రామాలకు చెందిన పలువురు ఆయకట్టు రైతులు గండ్రెడ్డి శంకర్రావు, కోట సత్యనారాయణ, కలం నర్సింగరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ మహేశ్వరరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కలెక్టరు స్పందనలో కూడా ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు. సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరందించే ఈ కాలువ గ్రామంలో పక్కాగా ఉండటం వలన తరచూ పూడిక పోతోందని, నిత్యం పూడిక తీయాల్సి ఉందన్నారు. కాలువ గట్టును పలువురు ఆక్రమణ చేసి భవనాలు నిర్మిస్తుండటం వలన పూడిక తీసేందుకు అడ్డంకి ఏర్పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు తొలగించి, ఆయకట్టుకు సాఫీగా సాగునీరు అందించేలా పంటకాలువను ఆక్రమణల నుంచి తొలగించాలని ఫిర్యాద తహసీల్దార్ మహేశ్వరరావును కోరారు.

ఎట్టకేలకు కల్వర్టు సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు శారద నగర్ మొదటి లైన్లో కల్వర్టు సమస్య ఎట్టకేలకు పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు సరిగ్గా లేకపోవడంతో, డ్రైనేజీలో మురుగునీరు పేరుకుపోయి, రోడ్డుపై పారడంతో పారిశుధ్యం క్షీణించడంతోపాటు రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకుగురయ్యారు. అంతే కాక దోమల విజృంభణతో నానా అవస్థలు పడ్డారు. సమస్యను స్థానిక వార్డు కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య దృష్టికి తేగా, కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించడంతోపాటు పలుమార్లు అధికారులను కలిసి, విన్నవించడంద్వారా కల్వర్టు పనులకు నిధులు మంజూరు చేయించారు. శాశ్వత ప్రాతిపదికన ఇక్కడ సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ, స్థానిక కౌన్సిలర్ దివ్య కృషి, చొరవను అభినందిస్తున్నారు ఇలాగే నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని అపారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

జెసిబితో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

ఆర్ఒఎఫ్ఆర్ పట్టాదారులకు పంట రుణాలిచ్చి ఆదుకోండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలున్న గిరిజనులకు బ్యాంకుల ద్వారా పంటరుణాలిచ్చి, వ్యవసాయానికి వారికి ఆర్థికంగా పెట్టుబడి ఆసరా ఇవ్వాలని కొయ్యూరు పిఎసిఎస్ ఛైర్మన్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనుల సాగులో ఉన్న భూములకు సాగుహక్కు కల్పిస్తూ ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలను అందజేసినా వీరికి ఎటువంటి ప్రభుత్వ సాయం అందని పరిస్థితి ఉందన్నారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టాదారులకు పంట రుణాలు ఇవ్వాలని ఇప్పటికే బ్యాంకు మేనేజర్ ఎస్.కె. నాయుడును కలిసి విన్నవించి, వినతి పత్రాన్ని అందజేసామన్నారు.అలాగే వీరికి రైతుభరోసా, పిఎం కిసాన్ ఇతర ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని చేకూర్చాలని కోరారు.

బిఎన్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -కొత్తకోట : మండల కేంద్రం రావికమతంలో బిఎన్ రోడ్డుకు ఇరువైపుల కాలువలపై ఉన్న ఆక్రమణలను పంచాయితీ, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో ఎట్టకేలకు తొలిగింపు ప్రక్రియ మంగళవారం చేపట్టారు. స్థానిక బస్స్టేషన్ ప్రాంతం నుంచి ప్రధాన కాలువలపై ఉన్న నిర్మాణాలను జెసిబి సహాయంతో తొలగించడం మొదలు పెట్టారు. వెనువెంటనే ట్రాక్టర్లతో మట్టి, సిమెంటు వ్యర్థాలను తరలించారు.

రావికమతంలో బిఎన్ రోడ్డు కిరువైపులా ప్రధాన డ్రైనేజీలపై దుకాణాలను ఏర్పాటు చేసి శాశ్వత కట్టడాలు చేపట్టడంతో కాలువలలో నీరు పారక మురుగునీరంతా రోడ్డుపై పారుతోంది. పరిస్థితి మరీ దారుణంగా ఉండటంతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ నేరుగా పరిశీలించి కాలవలపై ఆక్రమణ తొలగించాలని సంబంధిత శాఖల అధికార్లకు ఆదేశించారు. నాలుగు రోజులుగా ఆక్రమణదారులను హెచ్చరిస్తూ ఆటో ద్వారా విస్తృత ప్రచారం చేసిన పంచాయతీ సిబ్బంది, ఆక్రమణదారుల నుంచి స్వచ్ఛందంగా స్పందన లేకపోవడంతో మంగళవారం నుంచి తొలగింపు చేపట్టారు.

పారదర్శకంగా ఆక్రమణల తొలగింపు : ధర్మశ్రీ

రహదారి ఆక్రమణల తొలగింపులో అధికార్లు, సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆదేశించారు. ఆక్రమణల తొలగింపులో చిన్న పెద్దా తేడా చూపించవద్దన్నారు. ఆక్రమణదారుడు ఎన్ని అడ్డంకులు చేసినా పనులు మాత్రం ఆపవద్దన్నారు. కోర్టు నోటీసులంటూ కొంత మంది బెదిరిస్తున్నారని సిబ్బంది ధర్మశ్రీ దృష్టికి తేగా, కాలువలపై ఆక్రమణలు తొలగించవద్దని ఏ కోర్టు నోటీసు లివ్వలేదని, అటువంటి సమస్య వస్తే తాను చూసుకుంటానన్నారు.

25న 'ఆణిముత్యాలను దీవించండి'

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 25న నిర్వహించ తలపెట్టిన జగనన్న ఆణిముత్యాలను దీవించండి కార్యక్రమానికి ప్రజలందరూ వచ్చి విద్యార్థులను దీవించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఇఒ సాయి శైలజ కోరారు. నియోజకవర్గంలో 10వ తరగతి ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 25న. స్థానిక ఆర్డిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సాయంత్రం మూడు గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, నాలుగు మండలాల జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరౌతున్నారని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతోపాటు స్థానిక ప్రజలు అధికసంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఇఒ సాయిశైలజ కోరారు.